

	కనిష్టం	గరిష్టం
ఖమ్మం	37	24
భద్రాద్రి	36	24



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సా) : 6:24 (శుక్రవారం)
సహర్ (ఉ) : 4:55 (శనివారం)

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
3
శుక్రవారం, 15 మార్చి 2024







అశ్వాపురం మండలం బీజీకొత్తూరు వద్ద సీతారామ ప్రాజెక్టు పంపుహౌజ్ దృశ్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో గోదావరిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం ఏడేళ్లుగా నత్తనడకన సాగుతోంది. ప్రాజెక్టు పనుల్లో 95 శాతం పూర్తయినట్టు అధికారులు చెబుతున్నా.. సాగునీటి గలగలలు వినిపించడం లేదు. పలుచోట్ల పంప్‌హౌజ్‌లు పూర్తయినా, సత్తుపల్లి ట్రంక్ పనుల్లో జాప్యం, కాలువల నిర్మాణాలు పూర్తికాకపోవడం.. ప్రాజెక్టుకు శాపంగా పరిణమించాయి. రూ.13 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు 2016లో అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని సుమారు 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2020లో పూర్తి కావాల్సిన ఈ పథకం అనేకానేక సమస్యల వల్ల పడకేసింది. సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ నెల 11న భద్రాద్రిలో పర్యటించిన సందర్భంగా సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో 'సీతారామ' పూర్తిపై ఆశలు చిగురిస్తున్నాయి.

అయ్యో రామా.. 'సీతారామ'!



- ఏడేళ్లుగా సా...గుతున్న ఎత్తిపోతల పథకం
- 2016లో అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన
- రూ. 13 వేల కోట్ల అంచనా వ్యయం...
- 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం...
- పంప్‌హౌజ్‌లు పూర్తయినా, కాలువల నిర్మాణంలో జాప్యం
- సత్తుపల్లి ట్రంక్ పనుల్లోనూ అదే పరిస్థితి
- వచ్చే జూన్ నాటికి పూర్తిచేస్తామంటున్న అధికారులు

కొత్తగూడెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 2016లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.13,077 కోట్ల అంచనా వ్యయంతో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలోని బి.జి.కొత్తూరు వద్ద శంకుస్థాపన చేశారు. భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని సుమారు 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. వీటిలో సుమారు రెండులక్షల ఎకరాలను చెరువులు, ప్రాజెక్టులు నింపి సాగునీరు అందించడం ద్వారా స్థిరీకరణ చేస్తారు. మిగిలిన నాలుగున్నర లక్షల ఎకరాలకు ఎత్తిపోతల కాల్వల ద్వారా సాగునీరు సరఫరా చేయనున్నారు. సాగునీటితోపాటు కొన్ని గ్రామాలకు తాగునీటిని కూడా సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నారు. 2017ఏప్రిల్‌లో అప్పటి ఆర్అండ్‌బీ మంత్రి, ప్రస్తుత ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు పనులను ప్రారంభించారు. దుమ్ముగూడెం మండలంలో గోదావరి నుంచి మూడు జిల్లాల్లో సుమారు 243.20 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వ ద్వారా సాగునీరు అందించేలా రూపకల్పన చేశారు. ఇందుకోసం గోదావరి నుంచి 70 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి నాన్ ఫారెస్టు భూమి 13,593 ఎకరాలు, ఫారెస్టు భూమి 4,924 ఎకరాలు, వన్యప్రాణి సంరక్షణ విభాగానికి చెందిన 1,094.55 ఎకరాల భూమిని వినియోగిస్తున్నారు. వాస్తవంగా టెండర్లు పూర్తయిన నాటినుంచి 18 నెలల వ్యవధిలో ప్రాజెక్టు పూర్తి కావాల్సి ఉంది. కానీ భూసేకరణలో తలెత్తిన సమస్యలను అధిగమించేందుకు నిర్మాణ సమయాన్ని 2020 మార్చి వరకు పెంచారు. ఈ సమయం గడిచి నాలుగేళ్లయినా ఇంకా పనుల్లో జాప్యం కొనసాగుతోంది. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు పంపుహౌజ్ వద్ద 2019లోనే డ్రై రన్ జరగాల్సి ఉన్నా నేటికీ ఎదురు చూస్తోందంటే ప్రాజెక్టు పనితీరు ఎలా ఉందో తేటతెల్లమవుతోంది. ఇదిలావుండగా, రూ.13,077 కోట్ల అంచనా వ్యయంలో ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.7500 కోట్ల ఖర్చు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంకా సగం నిధులను వెచ్చించాల్సి ఉంది. అయితే 95 శాతం పనులు పూర్తయినట్టు అధికారులు చెబుతున్న తీరు అయోమయం కలిగిస్తోంది.

కాలువల మాటేమిటి...?

సీతారామ ఎత్తిపోతల పథకంలో కీలకమైన ప్రధాన కాలువ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. భద్రాద్రి జిల్లాలో మూడు పంపుహౌజ్‌లు, ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఒక పంపుహౌజ్ నిర్మాణాలు చేపట్టారు. అన్ని పంపుహౌజ్‌లు పూర్తయినా, సత్తుపల్లి ట్రంక్‌లో నేటికీ కాలువల నిర్మాణానికి భూ సేకరణ పూర్తి కాలేదు. దీంతో పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో చేపట్టిన పంపుహౌజ్, ములకలపల్లి మండలంలో ఒడ్డురామవరం, కమలాపురం గ్రామాలవద్ద చేపట్టిన పంపుహౌజ్‌లు పూర్తయినప్పటికీ, డ్రై రన్ కోసం వేచి ఉన్నాయి. కమలాపురం పంపుహౌజ్ నుంచి అన్నపురెడ్డిపల్లి, యాతాలకుంట మీదుగా సత్తుపల్లి ట్రంక్ వరకు పోయే ప్రధాన కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఈ మార్గంలో అన్నదైవం భూములుండటంతో సమస్య తలెత్తింది. సర్వే నెంబర్ 39లో బాలాజీ వెంకటేశ్వరస్వామి భూమి 21 ఎకరాల భూమిలో సర్వే సమస్య తలెత్తినట్లు చెబుతున్నారు. ఇదిలావుండగా ఈ నెల 11న భద్రాద్రిలో పర్యటించిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై అధికారులతో అంతర్గత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల పూర్తికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సీతారామ ప్రాజెక్టు త్వరలోనే సాకారం అవుతుందనే నమ్మకం ఏర్పడింది.

ఎస్ఈ ఏమంటున్నారంటే..

0-104 కిలోమీటర్ల ప్రధాన కాలువపై 32 స్ట్రక్చర్ల నిర్మాణంలో ఉన్నాయని వాటిని ఈ ఏడాది జూన్ నాటికి పూర్తిచేస్తామని సీతారామ ప్రాజెక్టు ఎస్ఈ వెంకటేశ్వర్ రెడ్డి చెబుతున్నారు. వైరా రిజర్వాయర్‌కు లింకేజి పనులకు ఇటీవలే శంకుస్థాపన చేశారని ఆ పనులు సైతం జూన్ నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సత్తుపల్లి ట్రంక్‌లో భూసేకరణ సమస్య కారణంగా జాప్యం చోటుచేసుకుందన్నారు. రూ. 74కోట్ల నిధులు అవసరం ఉందన్నారు. అవి విడుదలైతే పనులు వేగవంతం చేయగలమన్నారు.

నీటి ఉద్యమం **చేపడతా..**
- సీతారామ ప్రాజెక్టు నీటిని కొత్తగూడెం నియోజకవర్గానికి ఇవ్వాల్సిందే..
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

4



మంత్రి తుమ్మలను కలుసుకున్న ఇస్కాన్ ప్రతినిధులు

నగరంలో ఇస్కాన్ వంటశాల

- రూ.5కే భోజన పథకం అమలు సన్నాహాలు
- స్థలం కేటాయిస్తామన్న మంత్రి తుమ్మల

ఖమ్మం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రముఖ ఆధ్యాత్మిక సేవాసంస్థ ఇస్కాన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో భోజన పథకం ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం వంటశాలకు అవసరమైన స్థలం కేటాయించాలని ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో కలెక్టర్‌కు వంటశాలకు అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

రాష్ట్రంలో పలుచోట్ల ఇస్కాన్ సంస్థ వంటశాల ఏర్పాటు చేసి కొందరికి ఉచితంగా మరికొందరికి రూ.5కు భోజనం పథకం నిర్వహిస్తోంది. వరంగల్‌లోనూ ఇస్కాన్ సంస్థ ప్రభుత్వ పాఠశాలలు, పట్టణంలోని పలు కూడళ్లలో భోజన పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో జిల్లా కేంద్రమైన ఖమ్మంలోనూ ఇస్కాన్ వంటశాల ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ఆసక్తి చూపుతోంది. ఖమ్మం కార్పొరేషన్ పరిధితోపాటు మార్కెట్‌యార్డు, రైతులకు, మార్కెట్ కార్మికులకు, అలాగే పట్టణంలో పలు ఆసుపత్రులకు, నిరుపేదలకు సైతం భోజన పథకాన్ని అందించేందుకు ఇస్కాన్ సంస్థ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. కొంత దాతల సహాయం, మరికొంత ప్రభుత్వ సహాయంతో ఇస్కాన్ భోజన పథకం నిర్వహిస్తోంది. ఖమ్మంలో వంటశాలకు అవసరమైన స్థలం కేటాయిస్తే సేవా భావంతో వేలమందికి భోజనం, అల్పాహారాన్ని తయారు చేసి వాహనాల ద్వారా సంబంధిత ప్రదేశాలకు చేర్చి అందిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇస్కాన్ సంస్థ భోజనశాలను ఖమ్మంలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని, ఈ విషయమై ప్రభుత్వాన్ని కోరామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మా కుమారుడి పెళ్లికి రండి...



ఖమ్మం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తన చిన్న కుమారుడు భవ్యతేజ వివాహానికి రావాలని బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రికి శుభలేఖను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లలో శుక్రవారం నామా కుమారుడి వివాహం జరగనుంది. 18న హైదరాబాద్ మాదాపూర్‌లోని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నోవాటెల్‌లో రిసెప్షన్ నిర్వహించనున్నారు.

భద్రాద్రి వాసులకు 'ప్రత్యేక' దర్శనం

- 18నుంచి వారంలో మూడురోజులు ఉచితంగా అవకాశం
- భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, మార్చి 14: భద్రాద్రి దేవస్థానంలో స్థానికులకు 'ప్రత్యేక' అవకాశం కల్పిస్తూ దేవస్థానం అధికారులు నిర్ణయం తీసుకున్నారు. భద్రాచల స్థానికులకు ఇకపై ప్రతి మంగళ, బుధ, గురువారాల్లో సాయంత్రం 4నుంచి 5గంటల వరకు రూ.100ప్రత్యేక దర్శనాన్ని 'ఉచితం'గా కల్పించనున్నట్టు దేవస్థానం ఈవో రమాదేవి తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చేస్థానికులు స్థానిక గుర్తింపు పత్రంతో వస్తే రూ.100 క్యూలైన్ ద్వారా ఉచితంగా స్వామివారిని దర్శించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశం కేవలం భద్రాచలంలో నివాసం ఉండేవారికి మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఉచిత దర్శన సౌకర్యాన్ని 18వ తేదీ నుంచి కల్పిస్తున్నట్లు ఈవో వెల్లడించారు. ఉత్సవాలు, విశేష దినాలు, ప్రముఖులు వచ్చే రోజుల్లో మినహాయింపు ఉంటుందన్నారు.

డబుల్ దందా!

- గత ప్రభుత్వ హయాంలో 'డబుల్‌బెడ్‌రూం' పేరుతో వసూళ్లు
- ఇళ్లు ఇప్పిస్తామని రాజకీయ దళారుల ఎర
- ఒక్కొక్కరి నుంచి రూ.2లక్షల వరకు వసూలు
- ప్రభుత్వం మారడంతో పరిస్థితి తారుమారు
- తమ సొమ్ము తిరిగివ్వాలని బాధితుల వేడుకోలు

భద్రాచలం, మార్చి 14: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు.. కొందరు దళారులకు కాసుల వర్షం కురిపించాయి. నిరుపేదలకు ఇల్లు ఇప్పిస్తామని నమ్మించి కొందరు రాజకీయ దళారులు అక్రమంగా వసూళ్లకు పాల్పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో భద్రాచలం నియోజకర్గంలోని పలు మండలాల్లో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులతోపాటు ఇతర పార్టీల్లో బడానేతలతో పరిచయమున్న వారు డబుల్‌బెడ్‌రూం ఆశావాహులకు ఇల్లు ఇప్పిస్తామని అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండో విడతలో 700ఇళ్లు మంజూరు కాగా 337ఇళ్లు గతేడాది అక్టోబరు వరకు పూర్తయ్యాయి. అయితే ఆ ఇళ్ల నిర్మాణం పూర్తికాకముందు నుంచే ఒక్కొక్క ఆశావాహుడి వద్ద రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు వసూలు చేసి వారికే ఇళ్లు కేటాయించేలా చూస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేసినట్టు తెలుస్తోంది. అయితే డబ్బులు ఇచ్చి నెలలు గడిచినా ఇళ్లు రాకపోవడంతో గతంలో పలుమార్లు ఈ విషయంపై సదరు వ్యక్తులను ప్రశ్నిస్తే ఎన్నికల అనంతరం అధికారికంగా ఇళ్ల కేటాయింపు జరుగుతుందని దాటవేస్తూ వచ్చారు. అనూహ్యంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఇంటికోసం డబ్బు చెల్లించినవారంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి పర్యటన సమయంలో డబుల్‌బెడ్‌రూంలను లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తారని ప్రచారం జరిగినా అది ఆచరణ రూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో తమ దగ్గర డబ్బు తీసుకున్న వారిపై బాధితులు ఒత్తిడి తెస్తున్నా వారు ఏమాత్రం స్పందించకపోవడంతో తమకు దిక్కెవరని వాపోతున్నారు. ఏడాది క్రితమే రూ.లక్షల్లో వసూలు చేసిన దళారులు నేటికీ డబ్బు తిరిగి చెల్లించడంపై బాధితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అధికారికంగా ఫిర్యాదు చేస్తే తమకు ఇచ్చే డబ్బులు సైతం ఇవ్వరేమోనని మదనపడుతున్నారు. ఆశావహులనుంచి డబ్బు తీసుకున్నవారిలో రెండు కీలక ప్రధాన పార్టీలకు చెందిన వారి పాత్ర ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇకనైనా తమ పరిస్థితిని గుర్తించి న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా 'ఏలూరి'



ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 14: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏలూరి శ్రీనివాసరావు ఖమ్మం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే హోదాలో పనిచేసిన ఆయన భద్రాద్రి జిల్లాకు ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. అయితే ఇటీవల ఆయన టీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా తిరిగి బాధ్యతలు స్వీకరించారు. కాగా, శ్రీనివాసరావును టీజీవో సంఘం, టీఎన్జీవోస్ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షాతిరేకాలు

ఖమ్మం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కులస్తులకు కార్పొరేషన్ ఏర్పాటుచేస్తూ గురువారం జీవో విడుదల చేసింది. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని రాష్ట్రవ్యాప్తంగా కమ్మ సంఘాల నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిని కలిసి వినతిపత్రాల ద్వారా కోరారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇతర కులాల అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్టుగానే కమ్మ కులస్తులకూ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని మంత్రి తుమ్మల, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ప్రభుత్వం జీవో 52ద్వారా కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎవరి 'చేతి'కి?

- ఖమ్మం కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిపై కొనసాగుతున్న సస్పెన్స్
- భారీసంఖ్యలో ఆశావహులు
- తమవారికోసం ముగ్గురు మంత్రుల ప్రయత్నాలు
- ఎటూ తేల్చలేకపోతున్న అధిష్ఠానం

4



ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ఇంటిబాట పట్టిన హాస్టల్ విద్యార్థులు
- బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట

4





ఒక్కరికా.. ఇద్దరికా?

- మల్లు కుటుంబం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ఇద్దరి పోటీ
- ఖమ్మం టికెట్ ఆశిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి సతీమణి నందిని
- 'నాగర్ కర్నూల్' కోసం మల్లు రవి పట్టు

వైరా, మార్చి 14: లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచేందుకు మల్లు కుటుంబం నుంచి ఇద్దరు పోటీ పడుతుండడంతో కాంగ్రెస్ అధిష్ఠానం వారిలో ఎవరికి టికెట్ కేటాయిస్తుందనే అంశం చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్‌ను ఆశిస్తుండగా, భట్టి విక్రమార్క రెండో సోదరుడు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మల్లు రవి నాగర్‌కర్నూల్(ఎస్సీ) నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. ఖమ్మం టికెట్ కోసం భట్టి సతీమణి నందిని సుమారు వందలాదికార్లతో ర్యాలీగా హైదరాబాద్ వెళ్లి గాంధీభవన్‌లో దరఖాస్తు చేశారు. రాజకీయాల్లో భట్టికి మొదటి నుంచి ఆమె గట్టి మద్దతుగా ఉంటున్నారు. 'అమ్మ ఫౌండేషన్' స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం ఎంపీ నియోజకవర్గ పరిధిలో నిత్యం కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం టిక్కెట్‌పై ఆమె గట్టి ధీమాతో ఉన్నారు. ఇక నాగర్‌కర్నూల్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచి, ఒకసారి ఓటమిపాలైన డాక్టర్ మల్లు రవి ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ టికెట్‌పై గట్టి నమ్మకంతో ఉన్నారు. అయితే ఇదే టికెట్ కోసం ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కూడా పోటీపడుతున్నారు. రేవంత్‌రెడ్డి పీసీసీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి డాక్టర్ రవి ఆయనకు గట్టి మద్దతుదారుడిగా కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ దక్కకపోయినా ఎంపీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ టికెట్ వస్తుందని రవి గట్టి నమ్మకంతో ఉన్నారు. రేవంత్‌రెడ్డి తనపై ఎంతో విశ్వాసం ఉంచి ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించినా నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌కు ఆ పదవి అడ్డంకి అవుతుందనే భావనతో రవి ఆ పదవికి రాజీనామా చేశారు.

ఉమ్మడి ఏపీలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న తన పెద్దసోదరుడు మల్లు అనంతరాములు 1990 ఫిబ్రవరి 7న హఠాన్మరణం చెందడంతో అప్పటివరకు ప్రభుత్వ వైద్యుడిగా ఉన్న డాక్టర్ రవి తన ఉద్యోగానికి రాజీనామా చేసి సోదరుడి వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. తన సోదరుడు అనంతరాములు ప్రాతినిథ్యం వహించిన నాగర్‌కర్నూల్ నుంచి 1991ఎన్నికల్లో పోటీచేసి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 1996లో ఓడిపోయిన రవి తిరిగి మళ్లీ 1998లో అక్కడి నుంచే ఎంపీగా గెలిచారు. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఆ తర్వాత జడ్చర్ల ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. 34ఏళ్ల నుంచి కాంగ్రెస్ రాజకీయాలతో డాక్టర్ రవిది విడదీయలేని బంధం నెలకొంది. ఈ నేపథ్యంలో ఎంపీ టికెట్ కోసం పోటీపడుతున్న రవి, నందినిలో ఎవరికి పార్టీ టికెట్ ఇస్తుందనేదానిపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

భూసేకరణకు జాయింట్ కమిటీ ఏర్పాటు: కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 14: భద్రాచల రామాలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం ఐడీవోసీలో గురువారం భూసేకరణ అధికారులు, రెవెన్యూ, పంచాయతీ, దేవాదాయ, ఐటీడీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి దేవస్థానం అభివృద్ధికి మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. భూసేకరణకు భద్రాచలం తహసీల్దార్, పంచాయతీ ఈవో, దేవాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మండల సర్వేయర్‌తో కూడిన జాయింట్ కమిటీని ఏర్పాటు చేశారు.

ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇవ్వాల్సిన అనుకూలమైన భూమిని గుర్తించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక సిద్ధం చేసి సోమవారం నాటికి అందజేయాలన్నారు. భద్రాచల రామాలయ భూములకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పూర్తి వివరాలు అందజేయాలని ఆలయ ఈవో రమాదేవిని, ఆర్డీవో దామోదర్‌లను ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, భూమి కొలతలు, సర్వే ఏడీ కుసుమకుమారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమాదేవి, డిప్యూటి సీఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంట పదిలమేనా?

» పత్తాలేని మార్కెట్ ఫైరింజన్ » వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలపై ముందు చూపేది » మార్కెట్‌లో పంట భద్రతకు కానరాని భరోసా

ఖమ్మం మార్కెట్, మార్చి 14: మూలిగే నక్కమీద తాటి కాయ పడ్డ చందంగా తయారైంది రైతన్నల పరిస్థితి. అప్పులు చేసి అష్టకాష్టాలు పడి పండించిన పంటలకు మార్కెట్లలో భద్రత లేకుండా పోతుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు రైతులు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డులలో గత ఏడాది జరిగిన భారీ అగ్ని ప్రమాదం సంఘటన రైతులను ఇప్పటికీ తీవ్రంగా కలచి వేస్తుంది. ఆ సంఘటనతో మేల్కొన్న అధికారులు మార్కెట్‌కు హుటాహుటిన ఒక ఫైరింజన్ కేటాయించారు. అలా వచ్చిన ఫైరింజన్ నెల తిరగక ముందే సిబ్బంది జీత భత్యాల విషయంలో తేడా వచ్చి జిల్లా అగ్ని మాపక శాఖ మరలా వెనకకు తీసుకోవడంతో విషయం మళ్లీ మొదటికొచ్చింది. దీంతో మార్కెట్‌లో పంటల భద్రత విషయం గాలికి వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది మార్కెట్ యార్డులలో కాలి పోయిన పత్తి బస్తాలు వాస్తవంగా రైతులకి సంబంధించినవి కానప్పటికీ, ఒక వేళ రైతుల పంటలకు నష్టం జరిగితే పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మిర్చి లాంటి అధిక ధర ఉన్న వాణిజ్య పంటలు అగ్నిప్రమాదానికి గురైతే తాము నిండా మునిగిపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మార్కెట్ యార్డులలో రాత్రి వేళల్లో యార్డులలో దొంగతనాలు సైతం జరుగుతుండడంతో తమను మార్కెట్‌లో కాపాడే వారేరని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఎండాకాలం సీజన్ ప్రారంభమవడంతో మిర్చి రైతులు మార్కెట్‌లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.


మార్కెట్‌లో గతేడాది పత్తి యార్డులో జరిగిన అగ్ని ప్రమాద దృశ్యం(ఫైల్)

నెలరోజులకే వెళ్లిపోయిన ఫైరింజన్

ఖమ్మం మార్కెట్‌కు మిర్చి, పత్తి పంటలు ఎక్కువగా అమ్మకానికి వచ్చే అవకాశం ఉన్నందున ఫైరింజన్ ఆవశ్యకత ఎంతైన ఉందని గ్రహించిన 2012-13 నాటి మార్కెట్ కమిటీ ఫైరింజన్ కోసం రూ.కోటికి పైగా అగ్నిమాపక శాఖకు చెల్లించారు. కాగా సుమారు 11 సంవత్సరాల తరువాత గతేడాది మే నెలలో ఎట్టకేలకు మార్కెట్‌కు ఫైరింజన్‌ను కేటాయించారు. మార్కెట్‌లో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే స్పందించేందుకు గాను మార్కెట్ వద్దనే సదరు ఫైరింజన్ కోసం రూ.60 లక్షలతో ఫైర్ స్టేషన్ సైతం నిర్మించారు. అయితే మార్కెట్‌కు కేటాయించిన ఫైరింజన్ నెల రోజులకే వెళ్లిపోవడంతో ఆ ఫైర్ స్టేషన్‌ను మార్కెట్ అకౌంట్స్ సెక్షన్ కార్యాలయంగా వినియోగిస్తున్నారు మార్కెట్ అధికారులు

బెల్టు షాపులపై నియంత్రణ ఏది?

యార్డుల చుట్టూ ఉన్న బెల్టు షాపులు, బడ్డీ కొట్ల ప్రభావంతో మార్కెట్‌లో నిత్యం చిన్నా చితకా వివాదాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. యార్డులలో పొగ తాగడంతో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మార్కెట్ యార్డుల పక్కనే ఉన్న ఆయా బెల్టు షాపులను తొలగిస్తే అసలు ప్రమాదాలు జరిగే అవకాశం లేదని పలువురు పేర్కొంటున్నారు.


గతేడాది మార్కెట్‌కు కేటాయించిన ఫైరింజన్

పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు

మార్కెట్‌లో సెక్యూరిటీ సిబ్బంది లేమితో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మార్కెట్ పరిసరాలలో కొంతమంది యువకులు యార్డులలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. మార్కెట్ యార్డులలో సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయాలని పలువురు పేర్కొంటున్నారు.

ఫైరింజన్‌ను ఏర్పాటు చేస్తాం

ప్రవీణ్‌రెడ్డి, మార్కెట్ సెక్రటరీ



మార్కెట్‌లో ఫైరింజన్ ఆవశ్యకతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మార్కెట్ యార్డులలో క్రయ విక్రయాలు లేని సమయంలో బయటి వ్యక్తులకు అనుమతి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. సెక్యూరిటీ సిబ్బందిని మరింతగా సమకూర్చుకునే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వ్యాపారులు కొనుగోలు చేసిన పంటను వారి వారి గోడౌన్లకు తరలించుకోవాలి. ఐడి కార్డులు ఉన్న వారినే యార్డులలోకి అనుమతి ఇవ్వాలని సిబ్బందికి సూచించాం. మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం..

ఖమ్మం ఎవరి 'చేతి'కి ?

ఖమ్మం, మార్చి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి ఎంపికలో సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఆ పార్టీ మహబూబాబాద్ అభ్యర్థిగా బలరాంనాయక్ పేరును అధిష్టానం ఖరారు చేసినా ఖమ్మం అభ్యర్థి విషయంలో మాత్రం స్పష్టత రాలేదు. జిల్లాలో ముగ్గురు మంత్రులకు సంబంధించిన కుటుంబ సభ్యులు ఖమ్మం టికెట్ బరిలో ఉండడంతో ఎవరికి టికెట్ కేటాయించాలనే విషయంపై అధిష్టానం తేల్చుకోలేకపోతోంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉండడంతో ఈ స్థానం కోసం ముందుగా సోనియాగాంధీ పేరు తర్వాత రాహుల్‌గాంధీ పేరు ప్రచారంలోకి వచ్చింది. అయితే సోనియాగాంధీ రాజ్యసభకు ఎన్నిక కావడం, రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి మళ్లీ బరిలోకి దిగుతుండడంతో ఖమ్మం సీటుకోసం కాంగ్రెస్ ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డితో పాటు మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమకుమార్, కాంగ్రెస్ నేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, మరికొందరు కూడా ఖమ్మం టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కొందరు ఢిల్లీలోనే మకాం వేసి తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. వీరితో పాటు రాష్ట్రంలో మరికొందరు ప్రముఖులు కూడా ఖమ్మం టికెట్‌పై గురిపెట్టి తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో తమ సామాజికవర్గం ఓటుబ్యాంకు అధికంగా ఉందని, అందువల్ల టికెట్ తమకే ఇవ్వాలంటూ కొందరు ప్రముఖులు టికెట్ ప్రయత్నాలు సాగిస్తుండడంతో కాంగ్రెస్ నుంచి ఖమ్మం లోక్‌సభ టికెట్ ఎవరికి దక్కుతుందన్నది సస్పెన్స్‌గా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన తరువాతనే ఖమ్మం టికెట్ ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది.

మద్యం వ్యాపారులకు ఊరట

» ఫలించిన ఉమ్మడి జిల్లా వైన్స్ వ్యాపారుల ఆందోళనలు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 14: ఉద్యమాల గుమ్మం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైన్స్ వ్యాపారులు చేపట్టిన నిరసన కార్యక్రమం రాష్ట్ర స్థాయిలోని అన్ని జిల్లాల వైన్స్ వ్యాపారులకు వ్యాట్‌పై ఊరటను కలిగించింది. మద్యం వ్యాపారులు వ్యాట్ (వ్యాల్యూ యాడెడ్ ట్యాక్స్) రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని గత వారం ఉమ్మడి జిల్లాలోని మద్యం రవాణా చేస్తున్న వాహనాలను సేల్స్ ట్యాక్స్ అధికారులు నిలుపుదల చేసిన విషయం తెలిసందే. దీంతో వ్యాట్ సమస్యపై ఉమ్మడి జిల్లాలోని మద్యం వ్యాపారులు శని, సోమ, మంగళ మూడు రోజులు పాటుగా మద్యం రవాణా బంద్ చేశారు. ఫలితంగా రూ.18కోట్ల మద్యం అమ్మకాలు నిలిచి పోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం వ్యాపారులు ఖమ్మం వ్యాపారులకు సంఘీబావంగా బంద్ నిర్వహించారు. దీంతో మంగళవారం ఖమ్మం జిల్లా వైన్స్ అసోసియేషన్ నాయకులు గుర్రాల శ్రీనివాసరెడ్డి, గోవిందరాజు, ఇతర నాయకులను హైదరాబాద్‌కు పిలిపించి ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఎక్సైజ్ కమిషనర్, డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, సేల్స్ ట్యాక్స్ రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చలు జరిపారు. మద్యం రవాణా వాహనాలకు తాత్కాలికంగా ట్రాన్స్ పర్మిట్ లేఖను ఈనెల 15వరకు అందించారు.

అయితే మద్యం వ్యాపారానికి వ్యాట్ శాశ్వత పరిష్కారం చూపాలని వ్యాపారులు కోరడంతో ఎక్సైజ్‌శాఖ కమిషనర్ గురువారం ప్రత్యేకంగా సర్క్యులర్ జారీ చేశారు. ట్రాన్స్ పర్మిట్ స్థానంలో ఈ-వే బిల్లులను మద్యం రవాణా వాహనాలకు ఐఎంఎఫ్ఎల్ డిపోల ద్వారా అందజేయాలని ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలు తాత్కాలికంగా అమలులోకి రావటంతో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం వ్యాపారులకు వ్యాట్ నుంచి శాశ్విత పరిష్కారం దొరికిందని వైన్స్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వస్తు సేవల లోపాలపై కమిషన్‌ను ఆశ్రయించాలి

● చైర్మన్ లలిత


సమావేశంలో మాట్లాడుతున్న లలిత

ఖమ్మం లీగల్, మార్చి 14: వస్తు సేవల లోపాలపై జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాలని చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా కమిషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వినియోగదారులకు నష్టం వాటిల్లినప్పుడు జవాబుదారులు, కారకులను జరిమానాతోనే సరిపెట్టకుండా కఠిన శిక్షలు, జైలుకు పంపటానికి కూడా వెనుకాడని విధంగా ఈ కొత్త చట్టం వినియోగదారులకు రక్షణగా నిలుస్తోందని చెప్పారు. వినియోగదారుడు మోసపోయినప్పుడు ఆ వస్తువు ఎక్కడ కొనుగోలు చేసినాసరే ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఇప్పటివరకు 10,100 కేసులు దాఖలు కాగా, 9,922 కేసులను పరిష్కరించారు. ఇంకా 178 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కీలకమైన 85 కేసుల్లో రూ. 1,41,15,399 రూపాయలను కక్షిదారులకు నష్టపరిహారంగా ఇప్పించారని తెలిపారు. కేసుల స్థితిని తెలుసుకునేందుకు ప్రస్తుతమున్న కాన్ఫోనెట్ వెబ్‌సైట్ స్థానంలో కొత్తగా ఈ-జాగృతి అనే వెబ్ సైట్ యాప్‌ను ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలి

● సీఎస్ శాంతికుమారి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 14: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీతో ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆమె రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వి.పి. గౌతమ్, అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ, మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రెండేళ్ల పాటు పాఠశాల నిర్వహణ కమిటీ ఉంటుందన్నారు. అమ్మ పాఠశాల కమిటీల ద్వారా జూన్ 10 లోగా వసతులను కల్పించాలన్నారు. యూ.డి.ఐ.ఎస్.ఈ 2023 డేటా ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించి కలెక్టర్లు వెంటనే పరిపాలన అనుమతులు మంజూరు చేసి, జిల్లా సమాఖ్యకు అప్పగించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్ ఏ.డి. మైన్స్ సంజయ్ కుమార్, పి.ఆర్. ఇ.ఇ. వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్

విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలి

● ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్


సమీక్ష నిర్వహిస్తున్న పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, మార్చి 14: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన రైతులకు కరెంటు సమస్య లేకుండా సక్రమం గా సరఫరా అయ్యేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆర్వోఎఫ్ఆర్ ద్వారా పట్టాలు పంపిణీ చేసిన గిరిజన రైతుల పంట పొలాలకు కరెంటు సరఫరా అనేది తప్పనిసరని, అందుకు సంబంధిత విద్యుత్ అధికారులు, ఫారెస్టు అధికారుల సమన్వయంతో తప్పనిసరిగా గిరిజన రైతుల పొలాలకు కరెంటు సరఫరా చేయాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. గిరిజన రైతులకు కరెంటు సంబంధించిన పెండింగు లిస్టు ఏమైనా ఉంటే వెంటనే ప్రతిపాదన సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, డీటీఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏపీవో పవర్ మునీర్‌పాషా పాల్గొన్నారు.

గిరిజన అభ్యుదయ భవనం వేలం....

భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన అభ్యుదయ భవనం, సమ్మక్క సారక్క ఫంక్షన్ హాళ్లకు గురువారం వేలాన్ని ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో గిరిజన అభ్యుదయ భవనం సర్కారువారి వేలంపాట రూ.4 లక్షలు కాగా దుమ్ముగూడెం మండలానికి చెందిన శరత్‌బాబు రూ.4.37 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే సమ్మక్క సారక్క ఫంక్షన్ హాలుకు రూ.2.70 లక్షలకు ప్రతిపాదించగా భద్రాచలానికి చెందిన సాయిబాబు దొర రూ.3.34 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ భవనాలను సంవత్సరం పాటు వారి ఆధీనంలో ఉంటాయని ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య ఏటీడీవో నరసింహారావు, ఏపీవో పవర్ మునీర్‌పాషా, మేనేజరు ఆదినారాయణ పాల్గొన్నారు.

నీటి ఉద్యమం చేపడతా: కూనంనేని

సుజాతనగర్, మార్చి 14 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు నీరు కొత్తగూడెం నియోజకవర్గానికి అందించకపోతే మరో పోరాటం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సుజాతనగర్ మండలంలో గురువారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ... ఏదైనా ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలో సమృద్ధిగా సాగునీరు ఉండాలని, అట్లాంటి ప్రాంతాల్లోనే నాగరికత వెల్లివిరిసిందని గుర్తు చేశారు.

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదీ జలాలను కొత్తగూడెం నియోజకవర్గం గుండా తరలిస్తూ ఇక్కడి ప్రజలకు మాత్రం తాగు, సాగునీరు ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇక్కడి ప్రాంతం రెండు పంటలతో సస్యశ్యామలంగా ఉన్నప్పుడే ప్రజల జీవనోపాధి మెరుగవుతుందని అన్నారు. ప్రాజెక్టు నీటిని స్థానికంగా ఇవ్వడం కోసం మరో నీటి ఉద్యమం చేపట్టాలని, ఈ ఉద్యమంలో అందరూ తనతో కలిసి నడవాలని సాంబశివరావు పిలుపునిచ్చారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు


విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖమ్మం ఖానాపురం హవేలి/చుంచుపల్లి(కొత్తగూడెం), మార్చి 14: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సర విద్యార్థులు మొత్తం 18,481మందికి గాను 17,504 మంది పరీక్షలకు హాజరయ్యారు. 977మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు తెలిపారు. ఇక ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 18,097మందికి 17,589మంది పరీక్షలకు హాజరుకాగా 508 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,192మందికి 2,105మంది పరీక్షలకు హాజరయ్యారని డీఐవో తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ వీపీ గౌతమ్ తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని అధికారులు తెలిపారు. పరీక్షలు ముగియటంతో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు కేరింతలు కొట్టారు. హాస్టళ్లలో ఉండి చదుకుంటున్న విద్యార్థులను తల్లితండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. దాంతో బస్టాండ్, రైల్వేస్టేషన్లు విద్యార్థులతో కిటకిటలాడాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

భద్రాద్రి జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఇంటర్మిడియట్ నోడల్ అధికారి సులోచనరాణి తెలిపారు. ఫస్టియర్‌లో మొత్తం 10,200 మంది విద్యార్థులుండగా వారిలో ఒకేషనల్ విద్యార్థులు 2,433, జనరల్ విద్యార్థులు 7,767 మంది ఉన్నారు. సెకండియర్‌లో మొత్తం 9,275 మందికి హాల్ టికెట్లు ఇవ్వగా వారిలో 1,935మంది ఒకేషనల్, 7,342 మంది జనరల్ విద్యార్థులు ఉన్నారు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల్లో మొత్తం 90శాతం మంది పరీక్షలకు హాజరైనట్లు డీఐవో తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


చిట్టిబాబు

వైరా, మార్చి14: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గన్నవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇలారపు చిట్టిబాబు(24)కు ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని కొణిజర్ల గ్రా మానికి చెందిన సులోచన అనే యువతితో రెండేళ్ల కిందట వివాహమైంది. వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో విడాకులు తీసుకోవాలని పెద్దమనుషుల సమక్షంలో అంగీకరించి ఒప్పంద పత్రం కూడా రాసుకున్నారు. ఈ క్రమంలో ఆ యువతి తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడు....

ఎర్రుపాలెం, మార్చి 14: మండలంలోని పెద్దగోపవరం గ్రామానికి చెందిన మందరాజు(17) ఎర్రుపాలెం, తొండ్లగోపవరం రైల్వే స్టేషన్ల మధ్యన పెగళ్లపాడు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గరలో గల రైలు పట్టాలపై గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఖమ్మం జీఆర్పీ ఎస్ఐ పి.భాస్కరరావు, మధిర జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్.వేణుగోపాల్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ క్లీనర్ మృతి

ముదిగొండ, మార్చి 14: అనుమానాస్పద స్థితిలో ఓ లారీ క్లీనర్ మృతి చెందిన సంఘటన ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. తమిళనాడుకు చెందిన మహ్మద్ సలీం(45)న్యూలక్ష్మీపురం పరిధిలోని ఓ ఫ్యాక్టరీలో మిర్చిని అన్‌లోడ్ చేసేందుకు వచ్చాడు. బుధవారం అనుమానాస్పద స్థితిలో అతడు మృతి చెంది ఉన్నాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహం అడ్డగింత

జూలూరుపాడు, మార్చి14: మండలంలో ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు పాల్వంచకు చెందిన ఓ యువకుడుతో వివాహం చేయాలని ఇరు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. గురువారం ఓ గ్రామంలోని ఆలయంలో వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా మైనర్ బాలికకు వివాహం చేస్తున్నారని కొత్తగూడెం చైల్డ్‌లైన్ సిబ్బందికి సమాచారం అందడంతో అధికారులు ఆ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. సదరు బాలికను కొత్తగూడెం చైల్డ్‌లైన్ కేంద్రానికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సిబ్బంది లత, లలిత, బాలరాజు, రంజిత్, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, ఐసీడీఎస్ సిబ్బంది సునీత, సుశీల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి వాసు

ఖమ్మం క్రైం, మార్చి 14: ఇసుక అక్రమరవాణా కేసులో ఇటీవల అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న బోయపాటి వాసును ఖమ్మం టూటౌన్ పోలీసులు గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. 14 రోజులపాటు రిమాండ్‌లో ఉన్న ఆయన ఇసుక అక్రమరవాణా విషయమై విచారణ నిమిత్తం ఒకరోజు కస్టడీకి తీసుకున్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు న్యాయవాదుల సమక్షంలో ఆయన విచారణ చేయనున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మిత్రుడి కోసం వెళ్లి..ప్రాణాలొదిలాడు

● రేగుబల్లిలో ఘటన


కల్యాణ్

దుమ్ముగూడెం మార్చి 14: అర్ధరాత్రి మిత్రుడు ఫోన్ చేస్తే ఇంటి నుంచి బయటకు ద్విచక్ర వాహనంపై వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మండలంలో రేగుబల్లిలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురంలోని ఓ బెల్టు దుకాణంలో స్థానిక యువత, నరసాపురానికి చెందిన యువకుల మధ్య బుధవారం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణతో సంబంధం ఉన్న ఓ యువకుడు రేగుబల్లికి చెందిన రాయపూడి కల్యాణ్(28)కు అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో ఫోన్‌చేసి బెల్టు దుకాణం వద్దకు రమ్మన్నాడు. వెంటనే తన ద్విచక్రవాహనంపై బయల్దేరిన అతడిని భద్రాచలం నుంచి లక్ష్మీనగరం వైపు ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ప్రమాదస్థలంలోనే అతను మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు లక్ష్మీనగరానికి చెందిన మొబైల్ దుకాణం యజమాని గోసుల రామకృష్ణది కాగా, అతను కారుతో సహా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఘర్షణకు దిగిన యువకులను పోలీసులు అర్ధరాత్రి సమయంలోనే అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కేశవరావు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కల్యాణ్ మృతితో రేగుబల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంకితభావానికి తగిన గుర్తింపు

● ఇరు జిల్లాల నుంచి ఏడుగురు ఉత్తమ ఉద్యోగులు అవార్డులకు ఎంపిక


అవార్డులతో జిల్లా ఉద్యోగులు

కొత్తగూడెం కలెక్టరేట్/ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 14: భద్రాద్రి జిల్లాకు చెందిన నలుగురు మహిళా ఉద్యోగులు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ సేవకులకు గుర్తింపు నిచ్చారు. వారికి గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో ఆ శాఖ మంత్రి సీతక్క, అధికారులు సన్మానించి గౌరవించారు. జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, అశ్వారావుపేట సీడీపీఓ చంద్రకాని రోజారాణి, కొత్తగూడెం సూపర్‌వైజర్ కాగితపు రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ ప్రమీలకు ఈ ఉత్తమ పురష్కారాలు దక్కాయి. ఈకార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు శిశుసంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీ పాల్గొన్నారు.

ఖమ్మం ఖానాపురంహవేలి: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జిల్లా నుంచి ముగ్గురు ఉద్యోగులను రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపి క చేశారు. దీనిలో బాగంగా ఖమ్మం జిల్లా నుంచి ఒక అంగన్‌వాడి టీచర్, సీడీపీవో, సూపర్‌వైజర్లను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. మదిర ప్రాజెక్ట్ సీడీపీవో శారదాశాంత, తిరుమలాయపాలెం ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ ప్రసూన, ఏన్కూర్ అంగన్‌వాడి టీచర్ అ రుణకుమారిలను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి అవా ర్డులను ప్రదానం చేశారు. హైదరాబాదు రవీంద్రభార తిలో ఐసీడీఎస్ కమిషనర్‌గా నిర్మలాక్రాంతి వెస్లీ నుంచి అవార్డును స్వీకరించారు. ఈ అవార్డుల విషయం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం సిబ్బందిలో కొందరు రహస్యంగా ఉంచారని, ఎంపిక విషయం అంగన్‌వాడి టీచర్లకు కాని, సీడీపీవోలకు కాని, సూపర్‌వైజర్లకు కాని తెలియకుండ చేశారనే ఆరోపణలు వినపడుతున్నాయి.

వీధికుక్కల దాడిలో దుప్పికి గాయాలు

సత్తుపల్లిరూరల్, మార్చి14: వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి తీవ్రగాయాలైన సంఘటన గురువారం సత్తుపల్లిలో చోటు చేసుకుంది. సత్తుపల్లి డీఆర్‌వో ముత్యాలరావు తెలిపిన వివరాల ప్రకారం.. వేంసూర్ రోడ్డులోని నీలాద్రి అర్బన్ పార్క్‌లో ఓ చుక్కల దుప్పిపై వీధి కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. పశు వైద్య సిబ్బంది గాయపడిన దుప్పికి చికిత్సను అందించారు.

175 కేసుల పరిష్కారం

దమ్మపేట, మార్చి 14: జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా దమ్మపేట కోర్టులో గురువారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో న్యాయమూరి రామారావు 175 సివిల్ క్రిమినల్ కేసులను పరిష్కరించారు. దమ్మపేట అశ్వారావుపేట మండలాలకు చెందిన కక్షిదారులు డ్రంకెన్‌డ్రైవ్, సివిల్, క్రిమినల్ కేసులు విచారించి పరిష్కరించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

అశ్వారావుపేట, మార్చి 14: మండల పరిధిలోని తిరుమలకుంటలో గురువారం ఉదయం జరిగిన విద్యుదాఘాతంతో పొట్టా రంగారావుకు చెందిన పూరిల్లు ఇల్లు దగ్ధమైంది. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో 45వేల నగదు, ఇంట్లో ఉన్న వస్తువులు అన్ని కాలిబూడిదైపోయాయి. ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రెవెన్యూ అధికారులు సంఘటనను నమోదు చేసుకొని తక్షణ సహాయం అందజేశారు.

మధిరలో చోరీలు

మధిరటౌన్, మార్చి14: మధిర పట్టణంలో గుర్తు తెలియని దొంగలు బుధవారం అర్ధరాత్రి రెండు చోట్ల చోరీలకు పాల్పడి నగదు, బంగారం అపహరించారు. మధిరలోని సుందరయ్యనగర్‌లోని నివాసం ఉంటున్న బలగం మహేష్ తన ఇంటికి తాళం వేసి, తన ఇంటి ముందు ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని దొంగలు తన ఇంట్లో దాచుకున్న రూ.50వేల నగదు, బంగారు గొలుసును అపహరించారు. అదే విధంగా అంబేద్కర్ సెంటర్‌లోని ఓ మెడికల్ షాపులో షెట్టర్ తెరిచి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.50వేల నగదును చోరీ చేశారు. మధిర టౌన్ ఎస్ఐ సంధ్య రెండు చోరీ జరిగిన ప్రదేశాలను పరిశీలించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఆర్డీవో బదిలీపై కొనసాగుతున్న చర్చ

● ఎన్నికల బదిలీ నిలిచినట్లేనా ?

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 14: ఎన్నికల నిర్వహణ సందర్భంగా ప్రభుత్వ అధికారులకు బదిలీలు జరిగితే ఎంతటి ఉన్నత స్థాయి అధికారులైనా సర్వే తక్షణమే బదిలీ జరిగిన స్థానంలో రిపోర్టు చేస్తారు. అయితే ఖమ్మం జిల్లా డీఆర్డీవో ఎన్నికల బదిలీపై కొన్ని రోజులుగా చర్చ కొనసాగుతూనే ఉంది. మహబాద్ జిల్లా నుంచి ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారిగా ఆర్ సన్యాసయ్య గత నెలలోనే బదిలీపై వచ్చారు. అయితే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పలు కారణాలతో ఖమ్మం డీఆర్డీవో సన్యాసయ్యను జయశంకర్ భూపాలపల్లి డీఆర్డీవో గా బదిలీ చేస్తూ గత నెల 28న ప్రిన్స్‌పాల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తాన జీవో ఆర్టీ నెంబర్ 158 జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లిలో డీఆర్డీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న నరేష్‌ను ఖమ్మానికి బదిలీ చేశారు. కానీ ఇప్పటి వరకు ఖమ్మం డీఆర్డీవో బదిలీపై వెళ్లక పోవటంతో ఎన్నికల బదిలీ నిలిచినట్లేనా అనే చర్చ జిల్లా అధికారులు, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల మధ్య జరుగుతుంది. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి ఖమ్మం డీఆర్డీవో సన్యాసయ్యను వివరణ కొరగా ఉన్నత స్థాయి అధికారులు సరైన విషయం తెలియక తనను బదిలీ చేశారని తెలిపారు.

సైనిక స్కూల్ ఎంట్రెన్స్‌లో మల్లవరం బాలికకు ఆలిండియా ర్యాంకు


జోస్నిక

తల్లాడ, మార్చి 14: సైనిక స్కూల్ ఎంట్రెన్స్‌లో తల్లాడ మండలం మల్లవరం బాలిక ఆలిండియా ర్యాంకు సాధించింది. తొలి ప్రయత్నంలోనే బాలిక ప్రతిభను చాటుకుంది. అఖిలభారత స్థాయిలో సైనిక స్కూల్స్‌లో ఆరోతరగతి ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్-2024లో మల్లవరం గ్రామా నికి చెందిన కటికి జోస్నిక ఆలిండియా 714వ ర్యాంకు సాధించింది. 300మార్కులకు 271మార్కులు సాధించింది. తల్లాడ మండల చరిత్రలోనే సైనిక స్కూల్స్ ఎంట్రెన్స్‌లో అఖిలభారత స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థినిగా జోస్నిక రికార్డు సృష్టించింది. ప్రస్తుతం జోస్నిక ఐదోతరగతి చదువుతుంది. జోస్నిక తల్లిదండ్రులు మౌనిక, నర్సింహారావు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన జోస్నికను ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జడ్పీటీసీ ప్రమీల, ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్, మాజీ సర్పంచ్ దుగ్గిదేవర సామ్రాజ్యం అభినందించారు.

కాల్వలో పడి రెండేళ్ల చిన్నారి మృతి


ఖమ్మం క్రైం, మార్చి 14: ప్రమాదవశాత్తు మురుగు కాల్వలో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం ఖమ్మం పట్టణంలో జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని ఎల్బీనగర్ ప్రాంతంలో పలువురు సంచార జాతులవాళ్లు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. అక్కడ ఉండే వీరస్వామి, సరోజినీ దంపతుల మూడో కుమారుడైన శేఖర్(2) ఆడుకుంటూ పక్కనే ఉన్న మురుగు కాల్వలో పడిపోయాడు. కొంత సేపటి తర్వాత మురుగు కాల్వలో ఉన్న బాలుడిని గుర్తించి ఆసుపత్రికి తరలించారు. బాలుడిని పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

18ఇసుక లారీల నిలిపివేత

● అనుమతి పత్రాలు లేవని అడ్డుకున్న ఏపీ అధికారులు

భద్రాచలం/దుమ్ముగూడెం, మార్చి 14: భద్రాచలానికి సమీపంలో ఉన్న ఏపీలోని యటపాక పోలీసులు తెలంగాణకు చెందిన 18ఇసుక లారీలను గురువారం సాయంత్రం నిలిపివేశారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం తూరుబాక ఇసుక ర్యాంపు నుంచి ఇసుక నింపుకొని హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ లారీలను ఏపీ అధికారులు యటపాక వద్ద నిలిపేశారు. చింతూరు ఐటీడీఏ పీవో, ఆర్డీవో కావూరి చైతన్యను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా అంతరాష్ట్ర రవాణా నిబంధనల మేరకు తనిఖీలు నిర్వహించడం సర్వసాధారణమేనన్నారు. అనుమతిపత్రాలు లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని, దీనిపై పూర్తి సమాచారం రావాల్సి ఉందన్నారు.

ప్రశాంత ఎన్నికల కోసం సరిహద్దుల్లో పటిష్ట నిఘా



సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు

ఖమ్మంక్రైం, మార్చి 14: లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేందుకు ఇరు రాష్ట్రాల పోలీసులు సమష్టి కృషితో మందుకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలంగాణ-ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులు తెలిపారు. రాష్ట్రసరిహద్దు పోలీసుల మధ్య భద్రతా ఏర్పాట్లపై ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఏసీపీ కార్యాలయంలో గురువారం జిల్లా పోలీసు అధికారులు సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఇరు రాష్ట్రాల సమన్వయంతో పనిచేసి సరిహద్దుల వద్ద పటిష్ట భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సమావేశానికి మైలవరం ఏసీపీ ఎస్.మురళి మోహన్, నందిగామ ఏసీపీ బి.కిరణ్‌కుమార్, కృష్ణా జిల్లా ఎస్బీ ఏసీపీ పార్థసారధి, ఖమ్మంరూరల్ ఏసీపతి తిరుపతిరెడ్డి, కల్లూరు ఏసీపీ రఘు, వైరా ఏసీపీ రహమాన్, ఎస్బీ ఏసీపీ ప్రసన్నకుమార్, సీఐలు, ఎస్ఐలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేసీహెచ్‌పిలో ప్రమాదం

● కన్వేయర్ బెల్ట్‌లో పడి కార్మికుడికి గాయాలు

మణుగూరు, మార్చి 14: కొండాపురం కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో ఓ ఫిట్టర్‌కు హెల్పర్‌గా పనిచేసే సుబ్రమణ్యం నాయుడు పుల్‌కార్డు సమయంలో ఆటోమెటిక్‌గా రోటర్ ఆన్ కావడం వల్ల తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ తరలించారు. కాగా యాజమాన్యం సేఫ్టీ చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఏఐటియూసీ కార్యదర్శి రాంగోపాల్ ఆరోపించారు. యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అతడిని పరామర్శించారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్లు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగుళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

» ఇమడలేకనే బీఆర్ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప

» మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తుపెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

» రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కమ్మ సంఘ నాయకులు

కమ్మం కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని

మంత్రి తుమ్మల, రేణుకాచౌదరికి వినతి

ఖమ్మం, మార్చి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):రాష్ట్రంలో కమ్మ కులంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారి విద్య, ఉపాధి కోసం కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కమ్మ సంఘాల రాష్ట్ర సమైక్య ఆధ్వర్యంలో పలు జిల్లాల కమ్మ సంఘం నాయకులు హైదరాబాద్‌లో గురువా రం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభకు ఎన్నికైన రేణుకాచౌద రిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రం లోని పలు జిల్లాలకు చెందిన కమ్మసంఘం నాయకులు వేరువేరుగా ఇద్దరు నేతలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కలిసిన వారిలో కమ్మసంఘం రా ష్ట్ర ప్రధానకార్యదర్శి గంగవరపు రామకృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షుడు బొడ్డురవి శంకర్, కోశాధికారి కొడాలి రత్నాకర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్మసం ఘం నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, బత్తుల బసవపున్నయ్య పాల్గొన్నారు.



రేణుకాచౌదరితో కమ్మసంఘం నేతలు

రేపు జాతీయ లోక్ అదాలత్

ఖమ్మం లీగల్, మార్చి 14: జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో న్యాయాధికారి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన వివిధ మెజిస్ట్రేట్ కోర్టులలో కేసుల పరిష్కార ప్రక్రియ ప్రగతిని సమీక్షించారు. కేసుల పరిష్కార ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. కొన్ని పోలీస్‌స్టేషన్లలో లోక్ అదాలత్ నిమిత్తం కక్షిదారులను సమన్వయపరిచే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయలేదని కొందరు మెజిస్ట్రేట్‌లు తెలుపగా న్యాయాధికారి లైజన్ అధికారిని పిలిపించి ఈ విషయాన్ని పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాల్సిందిగా ఆదేశించారు. ఈసారి పోలీస్ కమిషనరే ప్రత్యేకంగా క్రిమినల్ కేసులు పరిష్కారాన్ని పర్యవేక్షిస్తున్నందున ఎక్కువ కేసులు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మెజిస్ట్రేట్ గోపిక, నాగశ్రావ్య, కె.దీప, వై.బిందుప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత, బి.రజని పాల్గొన్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్‌లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్‌ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్కుల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్ రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ



ప్రణీత్‌రావు (ఫైల్)

కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్కులు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరఫు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్ఎస్-2, మజ్లిస్-1

» ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం

» 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం

» ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం

» పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!

» ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు

» తెలంగాణలో బీజేపీ 8 సీట్లు గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో



రాగిడి లక్ష్మారెడ్డి ఆత్రంసక్కు

పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.

ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి: కోరం

ఇల్లందుటౌన్, మార్చి 14: మారుతున్న కాలానికి అనుగూనంగా జీవనశైలి, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వరల్డ్ కిడ్నీడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే ఎన్నోరకాల అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి ఉంటుదని పేర్కొన్నారు. మూత్ర పిండాలు మానవ శరీరంలో అతిముఖ్యమైనవని వివరించారు. మూత్రపిండాల ప్రాధాన్యత, సంరక్షణ కోసమే ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ కిడ్నీ డే నిర్వహిస్తున్నారని వివరించారు. మూత్రపిండాల వ్యాధులను నివారించడానికి ఆహారమే సమర్థవంతంగా పనిచేస్తుందని వివరించారు. మూత్ర పిండాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైద్యులు బసీం సలాల్ లెనిన్, సుధాకర్, కటకం దయాకర్, డయాలసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

చర్లలో విజృంభిస్తున్న జ్వరాలు

- జ్వరం, కాళ్ల నొప్పులతో బాధితుల అవస్థలు
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- క్యాంపులు పెడుతున్నా ఫలితం సున్నా
- దోచుకుంటున్న ఆర్ఎంపీలు, ల్యాబ్ నిర్వాహకులు
- కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు

చర్ల, మార్చి 14: చర్ల మండలంలో రోజు రోజుకూ జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రతీ ఇంట్లో ఎవరో ఒకరు జ్వరంతో కనిపిస్తున్నారు. కొయ్యూరు, సత్యనారాయణపురం వైద్య సిబ్బంది క్యాంపులు పెడుతున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు. జ్వరం బారిన పడ్డవాళ్ళు కాళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. ఇదే క్రమంలో చర్ల మండలంలో కొంత మంది ఆర్ఎంపీలు వచ్చీ రాని వైద్యం చేస్తూ పేదల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. అలాగే మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ల్యాబ్ నిర్వాహకుడు అధిక డబ్బులు వసూలు చేస్తూ గిరిజనులను మోసం చేస్తున్నాడు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చర్ల మండలంపై దృష్టి సారించాలని, జ్వరాలు ఆదుపులోకి వచ్చే వరకు జిల్లా వైద్య సిబ్బందిచే క్యాంపులు ఏర్పాటు చెయ్యాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

పెరుగుతున్న జ్వర బాధితులు

చర్ల మండలంలో సుమారు 26 పంచాయితీలు ఉన్నాయి. ప్రతీ పంచాయితీలో జ్వర బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా క్రాంతి పురం, కొత్తపల్లి, లింగాపురం, చర్ల, కొర్కట్‌పాడు, అంబేద్కర్ నగర్, కుర్నపల్లి, కందిపాడు, ఉప్పరిగూడెం, మామిడిగూడెం, ఇతర గ్రామాల్లో అనేక మంది జ్వర బారిన పడ్డట్లు తెలుస్తోంది. వీరిలో చాలా మంది ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరి కొంత మంది చర్ల, కొయ్యూరు, సత్యనారాయణ పురం వైద్యశాలలకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో వైద్యసిబ్బంది క్యాంపులు ఏర్పాటు చేస్తేన్నారు. ఇదే క్రమంలో గ్రామాలు, మండల కేంద్రంలో ఉన్న కొంత మంది ఆర్ఎంపీలు పేదలను దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. వైద్యం రాకపోయినా హైడోస్ ఇంజెక్షన్లు ఇస్తున్నారని తెలుస్తోంది. అలాగే మండల కేంద్రంలో ల్యాబ్ నడిపిస్తున్న ఓ నిర్వాహకుడు టెస్టుల పేరుతో భారీగా వసూళ్లు చేస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొంత కాలం నుంచి టెస్టుల పేరుతో లక్షలు గడించాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెస్టుల పేరుతో అమాయక గిరిజనుల నుంచి భారీగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఎంపీ వైద్యులు సైతం వచ్చీ రాని వైద్యంతో గిరిజనుల జీవితాలతో ఆడుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

జ్వరం వస్తే లేవలేని దుస్థితి

గత ఏడాది మార్చి, మే నెలల్లో ఇదే తరహాలో మండల కేంద్రాన్ని జ్వరాలు కుదిపేశాయి. సుమారు మూడు నెలల తరువాత జ్వరాలు అదుపులోకి వచ్చాయి. నేడు అచ్చం అదేపరిస్థితి చర్ల మండలంలో కనిపిస్తోంది. జ్వరం వస్తే ఒళ్ళు నొప్పులతో పాటు మోకాళ్ళ నొప్పులు వస్తున్నాయని బాధితులు చెబుతున్నారు. కనీసం చేతి వేళ్ళని కదపలేని పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. జ్వరం వస్తే నడవలేని స్థితికి చేరుకుంటున్నామని బాధితులు వాపోతున్నారు. అలాగే జ్వరాల విజృంబనకు చర్ల మండలంలో పారిశుద్య లోపం ఉన్నట్లు విమర్శలున్నాయి.



జ్వరాలతో చికిత్స పొందుతున్న బాధితులు

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

జూలూరుపాడు, మార్చి 14: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ పథకం క్రింద ప్రభుత్వం మంజూరి చేసిన చెక్కుల పంపిణీతో పాటు, రూ.8.70 కోట్ల నిధులతో నిర్మిస్తున్న పనులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ గురువారం సాయంత్రం శంకుస్థాపనలు చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 69 మంది లబ్దిదారులకు ప్రభుత్వం అందజేసిన సుమారు రూ.69 లక్షలకు సంబంధించిన చెక్కులను ఆయన లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనలో అర్హులందరికి సంక్షేమ ఫలాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

అశ్వారావుపేట, మార్చి 14: ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు గాను కృతజ్ఞతగా అశ్వారావుపేట, తిరుమలకుంటలలో మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆర్యవైశ్యులలో 70శాతం మంది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలు ఉన్నారని, కార్పొరేషన్ వీరందరికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు జల్లిపల్లి లోక్‌నాథ్ గుప్త, జిల్లా నాయకులు ఉమా మహేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

భద్రాచలం, మార్చి 14: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు చెందిన ఐదు నెలల పెండింగు జీతాలు తక్షణమే ఇవ్వాలని కోరుతూ గురువారం కార్మికులు వైద్యశాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ప్రభుత్వం కార్మికుల పెండింగు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఎంబి నర్సారెడ్డి, గడ్డం స్వామి, శానిటేషన్ వర్కర్లు రమా, కృష్ణకుమారి, మమత, వరలక్ష్మి, పెద్దరమణ, నాగరాజు, నరేంద్ర పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 14: జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన కనీస వేతనం, పర్మినెంట్ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ ప్రియాంకకు, జిల్లా పంచాయతీ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాలు సమర్పించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మాచారి, కోశాధికారి జిలకర పద్మ, ఉపాధ్యక్షులు దొడ్డా రవి కుమార్, వీరన్న కె సత్య, పంచాయతీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి, రంగా, చెన్నకేశవులు తదతరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగ పరిరక్షణకు పోరాటాలు



కొత్తగూడెంలో నిర్వహించిన ర్యాలీ

కొత్తగూడెం టౌన్, మార్చి 14: వ్యవసాయరంగ పరిరక్షణ కోసం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని అఖిలభారత ప్రగతీశీల రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కోరారు. వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని ఆరోపించారు. గురువారం కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం రైతువ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విమర్శించారు. రైతు సంక్షేమానికి పాటుపడాల్సిన ప్రభుత్వం రైతు ఉద్యమాలపై ఉక్కుపాదం మోపేవిధంగా చట్టాలను రూపొందించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, కిషోర్, ధర్మా, భాస్కర్, రాము, గోపాలరావు, సతీష్, నిమ్మల రాంబాబు, వేల్పుల రమేష్, వీరబాబు, వెంకన్న, గాంధీ పాల్గొన్నారు.

డీఏ విడుదల చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

పాల్వంచ, మార్చి 14: తమకు రావలసిన రెండు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ కార్మికులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పాల్వంచ కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్లో కార్మికులు 1535 యూనియన్ ఆధ్వర్యంలో ప్లకార్డులను చేతబూని సంస్థ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీఓ కూడా విడుదలైనప్పటికీ డీఏను విడుదల చేయడంలో సంస్థ యాజమాన్యం నిర్లక్ష్య దోరణిని అవలంబిస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా 1535 యూనియన్ రాష్ట్ర నాయకులు వజీర్ మాట్లాడుతూ డీఏలను విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యం వలన కార్మికులు, ఆర్టిజన్లు, ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురౌతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో 1535 యూనియన్ నాయకులు రాధాకృష్ణ, సాంబయ్య, శ్రీదర్, అంబాల శ్రీను, పుల్లారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాం

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 14 : సింగరేణి యాజమాన్యం ఈ ఆర్థిక సంవత్సరం నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని కొత్తగూడెం ఏరియా సాధించి అగ్రగామిగా నిలిచిందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు షాలెం రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియా ఈ ఆర్థిక సంవత్సరంలో 129.50లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా గురువారం నాటికి 129.74 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్త చేసి రికార్డు సృష్టించామని తెలిపారు. ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమిం చేందుకు ఇంకా 18రోజుల వ్యవధి ఉన్నప్పటికి ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించామని తెలిపారు. బొగ్గు ఉత్పత్తిని సాధించేందుకు శ్రమించిన కార్మికులను, ఉద్యోగులను అభినందించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచినప్పటికీ నిర్ధేశించిన సమయం కంటే ముందుగానే లక్ష్యాన్ని అధిగమించడం జరిగిందని తెలిపారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయడంతోపాటు ఉత్పత్తి చేసిన బొగ్గును రవాణా చేయడం అభినందనీయమని జీఎం పేర్కొన్నారు.

'పది' భవిష్యత్తుకు పునాది

కొత్తగూడెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో పదో తరగతి అనేది భవిష్యత్‌కు పునాది లాంటిదని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వరచారి అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హజరైన డీఈవో మాట్లాడుతూ కష్టపడి చదివిన ప్రతి విద్యార్థికి చక్కటి భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని కోరారు. సామాజిక సేవాకర్త, చాతకొండ వాసి ఆదికోటేశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థికి రూ.10వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.5వేలు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంపాక్స్‌లు, పెన్నులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. కృష్ణయ్య, ఉపాధ్యాయులు ఎస్. చలపతిరాజు, సురేష్, అమీరుద్దీన్, సీహెచ్. నాగలక్ష్మి, వాణి జగన్‌మోహినీ, పద్మ, అనసూర్య, లక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో పథకాల పేరుతో పేదలను పీడించారు

కరకగూడెం, మార్చి 14: గత ప్రభుత్వంలో దళిత బంధు పథకం స్కాముగా మార్చి పథకాల పేరుతో పేదలను పీడించారని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చందా మధు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో దళిత బంధు, బీసీ బంధు వంటి పథకాలలో ఎమ్మెల్యే నుంచి మండల స్థాయి నాయకుల వరకు పేద ప్రజలను నమ్మించి వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. నాయకులను నమ్మి డబ్బులు ఇచ్చిన బాధితులకు ప్రభుత్వ పథకాలు అందకపోవడం వలన దళారి నాయకుల బండారం బయటపడిందన్నారు. గత ప్రభుత్వం దళిత బంధు పథకం ద్వారా రూ, 10 లక్షలు యూనిట్లు కనుమరుగు అవుతున్నాయని.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని ఇప్పుడున్న ప్రభుత్వం అధికారులను పంపించి యూనిట్‌లని పర్యవేక్షించగలరని పేదలను పీడించి వసూళ్ళకు పల్పడ్డ ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుని పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 14: జిల్లాలో మారుమూల గిరిజన గ్రామాల్లో పోడు పట్టాదారులకు సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో ఆర్ఓఎఫ్ఆర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూసుకుంట, ఆళ్లపల్లి, కరకగూడెం వంటి మారుమూల గిరిజన గ్రామాలకు సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా గిరిజన గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. జిల్లాలో 634 మంది ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు బోర్లు వేసుకొనేందుకు అనుమతులు మంజూరు చేశామన్నారు. బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో భాస్కర్‌నగర్ రోడ్డుకి సంబంధించి త్వరితగతిన ఫామ్‌బి రిపోర్టు ఇవ్వాలని డీఎఫ్‌వో కోటేశ్వరరావును ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

అశ్వారావుపేట, మార్చి 14: విద్యార్థుల సామర్థ్యాలను గురువారం జిల్లా మానిటరింగ్ అధికారి నాగరాజు పరిశీలించారు. మండలంలోని మందలపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించారు.

పది పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

దుమ్ముగూడెం, మార్చి 14: పదోతరగతి పరీక్షా కేంద్రాలైన కెరేగుబల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నతపాఠశాల, నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల పరిసరాల్లో ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు 144 సెక్షన్ విధిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, మండల తహసీల్దార్ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. కేంద్రాల వద్ద రెండు వందల మీటర్ల పరిధిలో ప్రాణాంతక ఆయుధాలు ధరించడం, నలుగురు వ్యక్తులు గుమిగూడడంతోపాటు సమావేశాలు, ప్రదర్శనలు నిషిద్ధమని తెలిపారు. అలాగే జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు.

కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టండి

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 14: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వివిధ మైన్స్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం గురువారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు షాలెం రాజుకు వినతిపత్రం అందచేశారు. యాజమాన్యం నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు శ్రమిస్తున్న కార్మికులకు అవసరమైన సంక్షేమ పథకాలను సైతం వర్తింప చేయాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షులు ఎండి. రజాక్‌లు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలను మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ ఐఎన్‌టీయూసీ నాయకులు అల్బర్టు, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ధర్నా

జూలూరుపాడు, మార్చి14: శాశ్వత మార్కెట్ లేకపోవడంతో రైతులు, హమాలీలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఏఐటీయుసీ వైరా నియోజకవర్గ కార్యదర్శి మంకెన కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు అన్నారు. జూలూరుపాడులో శాశ్వత మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం స్థానిక ఉపమార్కెట్ ఎదుట ఏఐటీయుసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా శాశ్వత మార్కెట్ లేకపోవడంతో హామాలీలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఉపమార్కెట్ యాడ్‌లో షెడ్లు లేకపోవడంతో ఎండలోనే ఉండాల్సి వస్తుందన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు డీఏ విడుదల చేయాలి

మణుగూరు, మార్చి 14 : మణుగూరు లోని భద్రాద్రిథర్మల్ పవర్ స్టేషన్‌లో గురువారం టీఎస్ పీఈయూ-1535 ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న డీఏ (కరువుభత్యం)ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ధర్నా నిర్వహంచారు. 2023 జులై నెల నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏను విడుదల చేయాలని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

టేకులపల్లి, మార్చి 14: మండలంలోని తొమ్మిదవమైలుతండా, దాసుతండా గ్రామ పంచాయతీల్లో గురువారం పలువురు లబ్దిదారులకు ఇంటింటికి వెళ్లి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యాక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొన్న అర్హులైన వారందరికి ఆరు గ్యారెంటీలు అందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పేద కుటుంబంలోని ఆడపిల్లల పెళ్లికోసం ఇది వరకు ఇస్తున్న లక్ష రూపాయలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా త్వరలో తులం బంగారం ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీంద్రావు, ఆర్ఐ రత్తయ్య, ఎంపీటీసీ సభ్యులు బానోతు పూర్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సీఈ సన్మానం

పాల్వంచ, మార్చి 14 : ఈ నెల 7 నుంచి 11 వరకు భూపాలపల్లి స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీఎస్ జెన్కో స్టేట్ ఇంటర్ ప్రాజెక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తాచాటిన క్రీడాకారులను గురువారం పాల్వంచ కేటీపీఎస్ 5,6దశల సీఈ ప్రభాకరరావు సన్మానించారు. సీఈ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రధమ బహుమతి సాధించినందుకు గాను క్రీడాకారులకు మెమెంటోలను అందజేశారు.

పోషణ మాసం డబ్బులు చెల్లించాలి

పాల్వంచ రూరల్, మార్చి 15: రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పోషణమాసం డబ్బులు చెల్లించాలని, డబ్బులు చెల్లించకుండ పోషణమాసం కార్యక్రమాలు ఎలా చేస్తారని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి జి.పద్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి ప్రశ్నించారు. గురువారం ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్ హనీ నాకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి సత్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు రేగా పరామర్శ

బూర్గంపాడు మార్చి 14: అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని అంజనాపురం గ్రామ మాజీ సర్పంచ్ తేజావత్ సూర్యంను గురువారం పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పరామర్శించారు. ఈసందర్భంగా సూర్యం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి కామిరెడ్డి శ్రీలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు పొడియం నరేందర్, లక్ష్మీనారాయణ, ఖగేందర్, బాలిరెడ్డి, హుస్సేన్ నాయక్, చినపరెడ్డి, రామకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

గుండాల, మార్చి 14: నిషేదిత మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని ఇల్లందు డీఎస్పీ చంద్రబాను అన్నారు. గురువారం మండలంలోని దామరతోగు అటవీ ప్రాంతంలో పర్యటించారు. పోలింగ్ బూత్‌లను సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల సమస్యలను తెలుసుకొని అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని స్థానిక పోలీసులకు సూచించారు. సైబర్ క్రైమ్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సకల సదుపాయాలతో షాపింగ్ కాంప్లెక్స్: కూనంనేని



శంకుస్థాపన చేస్తున్న కూనంనేని

లక్ష్మీదేవిపల్లి, మార్చి 14: సకల సదుపాయాలతో వ్యాపార యోగ్యంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులకు సూచించారు. గురువారం లక్ష్మీదేవిపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.184లక్షల వ్యయంతో నిర్మించనున్న 21 షాపుల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, జిల్లాసమితి సభ్యులు వాసిరెడ్డి మురళీ, గనిగళ్ల వీరస్వామి, గెద్దాడ నగేష్, ఎంపీటీసీ నూనావత్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 82 లక్షలతో అభివృద్ధి పనులు

సుజాతనగర్: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం సుజాతనగర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రూ. 83 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. అదే విధంగా 42 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ - షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజక వర్గంలో మౌలిక వసతుల కల్పనే నా ధ్యేయం అన్నారు.

హామీలు నెరవేర్చటమే లక్ష్యం: పాయం



శంకుస్థాపన చేస్తున్న పాయం

అశ్వాపురం మార్చి 14: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన అశ్వాపురం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా పలు బీటీ రహదారులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, నెల్లిపాక సింగిల్ విండో చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అశ్వాపురం రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముభారక్ చెక్‌లను పంపిణీ చేశారు.

గిరిజన సంప్రదాయాలు సాంస్కృతిక చిహ్నాలు



దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే

పినపాక: ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు భిన్నమైనవని, ప్రకృతితో ఇమిడిపోయే ఆదివాసీ గిరిజనుల జీవన విధానం నేటికీ సాంస్కృతిక చిహ్నాలుగా వెలుగొందుతున్నాయని పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వ ర్లు అన్నారు. గురువారం మండలంలోని అమరారం గ్రామంలో మూడు రోజులుపాటు జరిగే నాగులమ్మ జాతరకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అలయ పూజారులు, దేవరబాలలు, జాతర నిర్వాహకులు కొమ్ము, డోలు నృత్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎమ్మెల్యేకు అశీర్వచనాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం మాట్లాడారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: మణుగూరు ఏరియాలోని పివీ కాలనీలో గల వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నప్రసాద వినియోగాన్ని నిర్వహించారు. వేలాది భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా జీఎం దుర్గం రమేష్, బ్రహోత్సవాల కమిటీ సభ్యులు డాక్టర్ శేషగిరిరావు, నర్సిరెడ్డి, లలిత్ కుమార్, రమేష్ బాబు పాల్గొన్నారు.